# సీఎం సర్.. చెట్లను కాపాడండి

**ప్రకృతి ప్రేమికురాలు బ్లెస్సీ వినతి • సుద్దాలలో విద్యుత్తు అధికారులు కొట్టేసిన హరితహారం వృక్షాల వద్ద ప్లకార్డు ప్రదర్శన**

కోనరావుపేట, మే 14: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాలలో రోడ్డుకు ఇరువైపులా పెంచిన చెట్లను విద్యుత్తు అధికారులు నరికేస్తున్నారు. ఆకు పచ్చని తెలంగాణే లక్ష్యంగా బీఆర్ఎస్ సర్కారు హరితహారం కింద రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు వృక్షాలుగా మారా యి. బాటసారులకు ఎంతో నీడనిస్తున్నాయి. అయితే నీడనిచ్చే చెట్లను నరికేస్తుండటంతో గ్రామానికి చెందిన ప్రకృతి ప్రేమికురాలు బ్లెస్సీ ఆవేదన వ్యక్తం చేసింది. విద్యుత్తు తీగలకు అడ్డు వచ్చిన కొమ్మలను మాత్రమే తొలగించాలని, చెట్లను పూర్తిగా నరికివేయవద్దని మంగళవారం నిరసన తెలిపింది. 'సీఎం సార్.. చెట్లను కాపాడాలని సిబ్బందికి చెప్పండి' అంటూ కొట్టేసిన వృక్షాల వద్ద నిల్చుని ప్లకార్డు ప్రదర్శించింది.




హరితహారం చెట్లను కాపాడాలని ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న చిన్నారి బ్లెస్సీ

## Format C-2

(For political party to publish in website, newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP(Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors.Vs.Union of India & Anr.)

Name of the Political Party : **BHARAT RASHTRA SAMITHI**

Name of the Election : **BYE- ELECTIONS TO TELANGANA LEGISLATIVE COUNCIL FROM WARANGAL-KHAMMAM-NALGONDA GRADUATES' CONSTITUENCY-2024**

**Name of State/~~UT~~ : TELANGANA**

| 1 | 2 | 3 | 4 | | 5 | | |
|---|---|---|---|---|---|---|---|
| Sl. No. | Name of Constituency | Name of Candidate | (A) Pending Criminal cases | | (B)Details about cases of conviction for criminal offences | | |
| | | | Name of Court, case No. & Status of the cases(s) | Sections of the Acts concerned & brief description of offence(s) | Name of Court & date(s) of orders(s) | Description of offence(s) & Punishment imposed | Maximum Punishment Imposed |
| 1. | WARANGAL -KHAMMAM-NALGONDA GRADUATES' | **RAKESH ANUGULA** | 1. Crime No.512/2023 P.S.Subedari, Hanumakonda District C.C.No:889/2024 IIIrd Addl. JFCM, Hanumakonda Accused No.1 | Sec. 143, 147, 148, 452, 535 R/w 149 of IPC Allegation of forming un-lawful assembly with an intention to house trespass and assault to deter a public servant from discharging of his duty | 29.12. 2023 CC.No: 2647/2020 Junior Civil Court Warangal-I | U/S. 143, 149, 188, 341, 504, 506 Allegation of defamation, making false statement, rumour etc circulated with intend to cause mutiny or offence against the public peace and criminal intimidation | Rs. 1500/- Fine imposed and paid |
| | | | 2.Crime No.258/2018 P.S. Hasanparthy, Hanumakonda District CC.No:246/2019 Principal JFCM Hanumakonda Accused No.2 | Sec. 188 of IPC Allegation of disobedience to an order lawfully promulgated by a public servant | | | |
| | | | 3.Crime No.20/2021 P.S.Matampally, Suryapet District Not Yet Numbered Judl.First Class Magistrate, Huzurnagar | Sec. 143, 144, 147, 148, 323 R/w 149 IPC Allegation of forming un-lawful assembly with an intention to causing hurt to deter a public servant from discharging of his duty | | | |
| | | | 4.Crime No.6/2022 One Town, Karimnagar Police Station Not Yet Numbered | Sec. 153, 500, 505 (2) & 506 of IPC Allegation of defamation, making false statement, rumour etc circulated with intend to cause mutiny or offence against the public peace and criminal intimidation | | | |
| | | | 5. Crime No.1/2021 P.S.Matwada, Warangal District Not Yet Numbered | Sec.341, 447, 143 R/w 149 of IPC Allegation of forming un-lawful assembly and conducted Dharna in front of KMC and obstructed employee in entering into KMC, Warangal | | | |
| | | | 6. Crime No.7/2022 One Town, Karimnagar Police Station C.C.No:717/2022 IInd Addl.JFCM Karimnagar | Sec.188 IPC and Sec.51 (B) of Disaster Management Act Allegation of disobedience to an order lawful promulgated by a public servant and refuse to comply with any direction given by or on behalf of the Central Government | | | |

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency

Sd/- **Signature of the Officer bearer of the Political Party**
**Name and Designation: SOMA BHARATH KUMAR**
**General Secretary**
**BHARAT RASHTRA SAMITHI**
**Telangana Bhavan, Road No.10,**
**Banjara Hills, Hyderabad-500034.**

# యాదాద్రి వెలుగులకు తొలి అడుగు

- యూనిట్ 1,2లో బాయిలర్లు లైటప్
- కీలక దశను అధిగమించిన విద్యుత్తు ప్లాంటు
- ప్రస్తుతానికి ట్రయల్ రన్..త్వరలో కమర్షియల్ ఆపరేషన్స్
- రెండుమూడు నెలల్లో గ్రిడ్‌తో అనుసంధానం



హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) :రాష్ట్ర విద్యుత్తు అవసరాలను తీర్చే యాదాద్రి విద్యుత్తు ప్లాంట్‌లో మంగళవారం కీలక ఘట్టం ఆవిష్కృతమయ్యింది. ఈ ప్లాంట్‌లోని రెండు యూనిట్లలోని బాయిలర్లను టీఎస్ జెన్‌కో అధికారులు మండించారు. మంగళవారం యూనిట్ -1, యూనిట్ -2 ఆగ్జిలరీ బాయిలర్లను జెన్‌కో అధికారులు వెలిగించారు. ఇక నుంచి ఈ రెండు యూనిట్లలో ట్రయల్ రన్‌ను చేపడతారు. ఆ తర్వాత దశలవారీగా విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభిస్తారు. కాస్త సమయం తర్వాత ఈ రెండు యూనిట్లల్లో కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభమయ్యే అవకాశముంది. కమర్షియల్ ఆపరేషన్స్ తర్వాత గ్రిడ్‌తో అనుసంధానిస్తారు. ఇందుకు రెండు నెలల సమయం పట్టే అవకాశముంది. బాయిలర్ లైటప్ అంటే కొలిమి వెలిగించడమని అర్థం. విద్యుత్తు ఉత్పత్తిలో ఇది మొదటి దశ. విద్యుత్తు ఉత్పిత్తి ప్రక్రియలో భాగంగా బొగ్గును వినియోగించి బాయిలర్లను మండిస్తారు. అధిక ఉష్ణోగ్రతల వద్ద ఆవిరి ఉత్పత్తి చేసి, ఈ ఆవిరితో ప్లాంట్‌లో బిగించిన టర్బైన్లను తిప్పుతారు. ఈ స్టీమ్ టర్బైన్లు విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. ప్రస్తుతానికి రెండు యూనిట్లల్లో బొగ్గును మండించడంతో బాయిలర్ చిమ్నీ నుంచి పొగలు విరజిమ్ముతూ రెండు యూనిట్లు విద్యుత్తు జనరేషన్‌కు సిద్ధమయ్యాయి.

### ఇటీవలే ఈసీ జారీ

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం, వీరప్పగూడెం గ్రామాల్లో టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో యాదాద్రి థర్మల్‌ప్లాంట్‌ను కేసీఆర్ ప్రభుత్వం చేపట్టింది. ఒక్కో యూనిట్‌ను 800 మెగావాట్ల సామర్థ్యంతో మొత్తం నాలుగువేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా ఐదు యూనిట్లను నిర్మిస్తున్నారు. రూ. 30వేల కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టగా, 2017లోనే ఈ ప్లాంట్‌కు కేంద్రం అనుమతులిచ్చింది. ఈ ప్లాంట్‌లో వినియోగిస్తున్న టెక్నాలజీ మారడంతో పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్జీటీని ఆశ్రయించాయి. ఎన్జీటీ తీర్పుతో ఆఖరుకు ఈ అంశం కేంద్ర పర్యావరణశాఖ చెంతకు చేరింది. ఇటీవలే కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఈ ప్లాంట్‌కు షరతులతో అన్నిరకాల పర్యావరణ అనుమతులు జారీచేసింది. ఈ నేపథ్యంలోనే టీఎస్ జెన్‌కో అధికారులు మంగళవారం బాయిలర్లను వెలిగించారు. ఈ ప్లాంట్‌లో నిర్మించే ఐదు యూనిట్ల గడువును టీఎస్ జెన్‌కో పొడగించింది. ఒక్కో యూనిట్‌ను ఎప్పటి వరకు పూర్తిచేస్తామో ఆయా వివరాలను కేంద్రానికి సమర్పించింది.

| యూనిట్ | గడువు |
|---|---|
| యూనిట్ -1 | 15-10-2024 |
| యూనిట్ -2 | 15-10-2024 |
| యూనిట్ -3 | 31-03-2025 |
| యూనిట్ -4 | 31-12-2025 |
| యూనిట్ -5 | 28-12-2025 |

### హర్షం వ్యక్తంచేసిన టీఎస్‌పీఈఏ

యాదాద్రి విద్యుత్తు ప్లాంట్ లైటప్‌పై తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) హర్షం వ్యక్తంచేసింది. ఐదు యూనిట్ల ఈ ప్లాంట్‌లో రెండు యూనిట్లల్లో లైటప్ ప్రక్రియలో భాగస్వామ్యమైన విద్యుత్తు ఇంజినీర్లు, విద్యుత్తు సంస్థ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపింది. ఈ చారిత్రాత్మకత ఘట్టం ఆవిష్కృతమయ్యేందుకు అద్భుతంగా పరిశ్రమించిన వారికి టీఎస్‌పీఈఏ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు పీ రత్నాకర్ రావు, పీ సదానందంలు అభినందించారు.

## నెలాఖరులో ఎస్ఎల్‌బీసీ పనులు మళ్లీ షురూ!

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం పనులను ఈ నెలాఖరులో తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లు రూ.50 కోట్లు మంజూరు చేసినట్టు తెలుస్తున్నది. టన్నెల్‌లో తరుచూ నీళ్లు కారుతుండటంతో.. సీపేజీ నివారణ కోసం జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాతో అధ్యయనం చేయిస్తున్నది. వారం పది రోజుల్లో నిపుణుల నివేదిక వస్తుందని, దాని ఆధారంగా నెలాఖరు నాటికి పనులు మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించినట్టు సమాచారం.

## సీఎం జగన్ విదేశీ పర్యటనకు అనుమతి

నాంపల్లి కోర్టులు మే 14 (నమస్తే తెలంగాణ) : ఏపీ సీఎం వైఎస్ జగన్ విదేశాలకు వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. యూరప్ పర్యటనతోపాటు అమెరికాలోని తన కూతురిని కలిసేందుకు అనుమతి ఇవ్వాలని సీఎం జగన్ పిటిషన్ దాఖలు చేశారు. జగన్ విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని సీబీఐ కోరింది. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు సీఎం జగన్ విదేశీ పర్యటనకు ఈ నెల 17 నుంచి జూన్ 1 వరకు అనుమతిస్తూ మంగళవారం ఆదేశాలిచ్చింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుండటంతో అప్పటివరకు జగన్ పర్యటన ముగించుకొని భారత్‌కు చేరుకొంటారు.

## జూలో బెంగాల్ టైగర్ 'అభిమన్యు' మృతి

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కులో తెల్ల మగపులి బెంగాల్‌టైగర్ 'అభిమన్యు' మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. తొమ్మిది ఏండ్ల అభిమన్యు 2015 జనవరి 2న నెహ్రూ జులాజికల్ పార్కులో సైర్ (బద్రీ), డ్యామ్ (సురేఖ/సమీరా)కు జన్మించింది. 2023 ఏప్రిల్ 21 నుంచి మూత్రపిండాల సమస్యతో అనారోగ్యానికి గురైంది. అప్పటి నుంచి జంతు ప్రదర్శనశాలలో పశువైద్య నిపుణులు దానికి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం క్రమంగా క్షీణించి కన్ను మూసింది. జూపార్క్ అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## తొలిదశ ఉద్యమకారుడు రామదాస్ కన్నుమూత

కంటోన్మెంట్, మే 14: ప్రత్యేక తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు కొలిశెట్టి రామదాస్ కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా మంగళవారం హైదరాబాద్ న్యూబోయిన్‌పల్లిలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా ఇల్లందులోని గేటు కారేపల్లికి చెందిన రామదాసుకు తొలి నుంచే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కాంక్ష ఉండేది. జిల్లాలన్నీ తిరిగి నాయకులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులను ఐక్యం చేశారు. 1969లో ఖమ్మంలోని డిగ్రీ విద్యార్థి రవీంద్రనాథ్‌తో రెండువారాలు ఆమరణ దీక్ష చేయించి, తెలంగాణ సాధన ఆవశ్యకతను చాటిచెప్పి తొలిదశ ఉద్యమానికి ఆజ్యం పోశారు. ఖమ్మం ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో 'నాన్ ముల్కీ గో బ్యాక్' నినాదాన్ని అందించడమే కాకుండా, తెలంగాణ ప్రాంతీయ పార్టీని స్థాపించారు. అనంతరం సింగరేణిలో పనిచేశారు. ఆయనకు కుమారులు మాధవ్, రఘువీర్, కుమార్తెలు శ్రీదేవి మాధవి, శ్రీలత ఉన్నారు. న్యూబోయిన్‌పల్లి బాపూజీనగర్ హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.



రామదాస్ (ఫైల్)

### రామదాస్ మృతి తీరనిలోటు: వీ ప్రకాశ్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర తొలి దశ ఉద్యమకారుడు కొలిశెట్టి రామదాస్ మృతి తెలంగాణకు తీరనిలోటని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, రాజకీయ విశ్లేషకులు వీ ప్రకాశ్ పేర్కొన్నారు. బోయిన్‌పల్లిలో రామదాస్ భౌతికకాయాన్ని ప్రకాశ్ సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ 1969 కంటే రెండేండ్ల ముందు నుంచే రామదాస్ ఉద్యమాన్ని నడిపారని కొనియాడారు. పెద్ద మనుషుల ఒప్పందానికి తూట్లు పొడుస్తున్న తరుణంలో తెలంగాణ ప్రాంతీయ రక్షణ సమితి పేరిట ఇల్లందులో ఓ కార్యాలయాన్ని తెరిచారని గుర్తు చేశారు. అలాంటి ఉద్యమ నేత గురించి తెలంగాణ సమాజం తెలుసుకోవాలన్నారు.

## వరి కొయ్యలను తగలబెట్టొద్దు

### రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన



హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) : వరి కోత తర్వాత కొయ్యలను తగలబెట్టొద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. అలాచేస్తే పర్యావరణ కాలుష్యంతోపాటు అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని, ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వరి కొయ్యలను కాల్చకుండా నీళ్లలో మురిగిపోయేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ రూపొందించి, రైతులకు ప్రత్యామ్నాయ విధానాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కవిత జ్యుడీషియల్ కస్టడీ 20 వరకు పొడిగింపు

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న కవితను.. జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో అధికారులు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను కోర్టు ముందు హాజరుపరిచారు. దర్యాప్తు కొనసాగుతున్నందున మరో 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగించాలని ఈడీ అధికారులు కోర్టును కోరారు. దర్యాప్తు సంస్థ విజ్ఞప్తి మేరకు ఈ నెల 20వ తేదీ వరకు కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తున్నట్టు న్యాయస్థానం ప్రకటించింది. ఇదిలా ఉండగా ఈ కేసుకు సంబంధించి ఈడీ అధికారులు ఎనిమిదివేల పేజీలతో సప్లిమెంటరీ చార్జిషీట్‌ను దాఖలు చేశారు. చార్జిషీటును పరిగణనలోకి తీసుకునే అంశంపై ఈ నెల 20వ తేదీన విచారణ చేపడ్తామని కోర్టు వెల్లడించింది.

## కోటి ఖర్చు పెట్టినా కొడుకు దక్కలె!

వేములవాడ, మే 14: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎదిగిన కొడుకును కాపాడుకునేందుకు ఆ నిరుపేద కుటుంబం తల్లడిల్లింది. చేసేది చిన్నాచితక వ్యాపారమే అయినా తనయుడిపై ప్రేమతో శక్తికి మించి అప్పులుచేసి ఆఖరిదాకా పోరాటం చేసింది. ఒకటికాదు రెండు కాదు.. ఏకంగా రూ.కోటి ఖర్చు పెట్టి మూడు నెలలపాటు చికిత్స చేయించినా ప్రాణం దక్కకపోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటన వేములవాడలో విషాదాన్ని నింపింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పన్యాల రాజు-రాణి దంపతులు కొన్నేండ్లుగా వేములవాడ పట్టణంలోని సుబ్రహ్మణ్యంనగర్‌లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కొడుకులు. చిన్న కుమారుడు శ్రీచరణ్ (18) బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. గత ఫిబ్రవరి 10న బైక్ సర్వీసింగ్ కోసం కరీంనగర్ షోరూమ్‌కు వెళ్లి తిరిగివస్తుండగా ఉజ్వలపార్కు సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తరలించగా, అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ దవాఖానలో చేర్పించారు. దాదాపు మూడు నెలలుగా దవాఖానలోనే ఉన్న శ్రీచరణ్‌కు వైద్యులు మూడుసార్లు తలకు శస్త్ర చికిత్స చేశారు. ఇందుకోసం రూ.కోటికిపైగా వెచ్చించినా నయం కాలేదు. సోమవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. కొడుకు కోసం శక్తికి మించి అప్పు చేసినా.. కండ్ల ముందే కాలం చేయడంతో ఆ కుటుంబ సభ్యులు భోరునవిలపించారు.

# దశాబ్ది ఉత్సవాల ఊసేదీ?

- జూన్ 2తో రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తి
- నిరుడు ఘనంగా ఉత్సవాల నిర్వహణ
- ఈసారి ఆ ఊసెత్తని కాంగ్రెస్ సర్కార్
- సమయం దగ్గర పడుతున్నా మౌనమే



హైదరాబాద్, మే 14(నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్ష నెరవేరి పదేండ్లు పూర్తవుతున్న సందర్భాన్ని ఎంతో గొప్పగా జరుపుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది వేడుకలపై మౌనం దాల్చింది. మరో పక్షం రోజుల్లో పదేండ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వేడుకల నిర్వహణకు ఎటువంటి చర్యలూ తీసుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ప్రజల చిరకాల స్వప్నం సాకారమైన సందర్భం కాబట్టి ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకొని వేడుకలు నిర్వహించే అవకాశమున్నా, ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఏమాత్రమూ ప్రయత్నించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. జూన్ 1తో దేశంలో ఎన్నికల హడావుడి ముగుస్తుంది. కాబట్టి వేడుకల నిర్వహణకు ఎన్నికల కమిషన్ అభ్యంతరం చెప్పకపోవచ్చు.

### నిరుడు 21 రోజులపాటు ఉత్సవాలు

కేసీఆర్ నేతృత్వంలో జరిగిన మలిదశ ఉద్యమంతో 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. వచ్చే జూన్ 2తో రాష్ట్రం ఏర్పడి సరిగ్గా పదేండ్లు పూర్తవుతుంది. రాష్ట్ర ఏర్పాటు తరువాత తొమ్మిదిన్నరేండ్లపాటు కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అనేక రంగాల్లో నంబర్-1 స్థానానికి ఎదిగింది. వ్యవసాయం, నీటి పాదరుల, పరిశ్రమలు, విద్యం, వైద్యం తదితర రంగాల్లో పెద్ద రాష్ట్రాలను సైతం వెనక్కి నెట్టేసింది. రాష్ట్రం ఏర్పడి 9 ఏండ్లు పూర్తయి పదో ఏటలోకి అడుగుపెట్టిన సందర్భంగా కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గత ఏడాది జూన్ 2 నుంచి 21 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించింది. ఇందులో భాగంగా ఆటపాటలు, కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, సంగీత విభావరి, సినిమా, జానపద కళాకారులతో ప్రదర్శనలు, సంగీతం, నృత్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. జూన్ 2న జాతీయ జెండా ఆవిష్కరణతో ప్రారంభమైన ఉత్సవాలు 22న అమరుల సంస్మరణతో ముగిశాయి. తెలంగాణ అమరుల స్మారకం ప్రారంభోత్సవంలో భాగంగా జూన్ 22న అప్పటి సీఎం కేసీఆర్ మొదట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నిత్యజ్వలిత దీప్తి అమరజ్యోతిని వెలిగించారు. తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ ఘనకీర్తిని నలుదిశలా చాటేలా పండుగ వాతావరణంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి రాజధాని హైదరాబాద్ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించారు. వేడుకల నిర్వహణకు ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానాన్ని, తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబించేలా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల లోగోను కూడా ఆవిష్కరించింది.

### పోరాట యోధులను స్మరించుకోరా?

జూన్ 2తో రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ప్రభుత్వం తరపున దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణవాదులు కోరుతున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించి పోరాట యోధులను సత్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ ఘనకీర్తిని నలుదిశలా వ్యాపింపజేసే విధంగా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రాష్ట్రంలో ఎన్నికలు పూర్తికావడం, ఇక్కడ నిర్వహించే వేడుకలు ఇతర రాష్ట్రాల్లోని ఎన్నికలపై ఎటువంటి ప్రభావమూ చూపే అవకాశం లేకపోవడంతో అడిగితే ఎన్నికల కమిషన్ కూడా అనుమతినిస్తుందని చెప్తున్నారు. మరి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## కోడిగుడ్డు @ 7

- *డిమాండ్‌కు తగ్గ సరఫరాలేకనే ధరలు పైపైకి*
- *మరో రెండు నెలలు ఇదే పరిస్థితి!*

*హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చికెన్ ధరతో పాటు కోడిగుడ్డు ధర కూడా కొండెక్కి కూర్చుంది. ప్రస్తుతం కేజీ చికెన్ రూ.270 నుంచి రూ.300 పలుకుతుండగా, గుడ్డు ధర కూడా విపరీతంగా పెరిగింది. నెల రోజుల వ్యవధిలో ఫాం వద్ద గుడ్డు ధర సుమారు 90 పైసలు పెరిగినట్టు వ్యాపారులు చెప్తుతున్నారు. గత నెల ఏప్రిల్ 13న గుడ్డుధర రూ.4.45 పైసలు ఉండగా.. ప్రస్తుతం రూ.5.35కు చేరింది. రిటైల్ మార్కెట్‌లో చిల్లరగా ఒక్క గుడ్డును రూ.6.50 నుంచి రూ.7 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. అధిక పోషకాలుండే గుడ్డును నిత్యం ఆహారంలో తీసుకొనే చాలా మంది పెరిగిన ధరల కారణంగా గుడ్డును కొనుగోలు చేయలేక, ఆకుకూరల వైపు చూస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో గుడ్డు ధరలు పెరిగినట్టు వ్యాపారులు చెప్తున్నారు. రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతల కారణంగా గుడ్లు పెట్టే లేయర్ కోళ్ల మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి.దీంతో మార్కెట్‌లో గుడ్ల కొరత ఏర్పడింది. సాధారణంగానే వేసవిలో లేయర్ కోళ్లు వడగాడ్పుల కారణంగా తక్కువ దాణా తీసుకొంటాయి. కొన్ని కోళ్లు ఎండ తీవ్రతకు తట్టుకోలేక మృత్యువాతపడుతుంటాయి. తద్వారా గుడ్ల ఉత్పత్తి తగ్గుతుంది. ఈ ప్రభావమే ప్రస్తుతం మార్కెట్ పై పడింది. దీంతో గుడ్ల కొరత ఏర్పడటంతో పాటు ధర పెరిగింది. గుడ్ల ధరలు తగ్గాలంటే మరో రెండు నెలలు ఆగాల్సిందేనని పౌల్ట్రీ వ్యాపారులు చెప్తున్నారు. వాతావరణం చల్లబడి లేయర్ కోళ్లు చనిపోకుండా ఉంటే గుడ్ల ఉత్పత్తి పెరుగుతుందని అంటున్నారు. ఆ తర్వాత సప్లయ్ పెరిగి ధరలు అదుపులోకి వస్తాయని అంటున్నారు. రాష్ట్రంలో ప్రతి రోజు 3.7 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో 1.7 కోట్లు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా, రాష్ట్రం నుంచి మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు గుడ్ల సరఫరా అవుతున్నాయి. రాష్ట్రంలో సగటున ఒక మనిషి రోజుకు 1.5 గుడ్లు వినియోగిస్తున్నట్టు మార్కెటింగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.*

## పసిబాలుడిని చంపిన శునకం

### తాండూరులో పెంపుడు కుక్క దారుణం

తాండూరు, మే 14: వికారాబాద్ జిల్లా తాండూరులో మంగళవారం దారుణం జరిగింది. నిద్రిస్తున్న 5 నెలల పసిబాలుడిపై కుక్క దాడి చేసింది. తీవ్ర గాయాలతో బాలుడు మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం దుప్పల్లికి చెందిన దత్తు, లావణ్య దంపతులు తమ కుమారుడు సాయినాథ్ (5 నెలలు)తో కలిసి తాండూరు పట్టణ సమీపంలోని నాగభూషణం పాలిషింగ్ యూనిట్లలో పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు. మంగళవారం బాలుడు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తండ్రి పాలిషింగ్ యూనిట్‌లో పని చేస్తుండగా.. తల్లి లావణ్య పనిమీద బయటకెళ్లింది. నిత్యం పాలిషింగ్ యూనిట్లలో ఉండే ఓ యజమాని పెంపుడు కుక్క నిద్రిస్తున్న పసి బాలుడిపై దాడి చేసింది. బాలుడి ఏడుపు విన్న కుటుంబ సభ్యులు బాలుడి దగ్గరకు వచ్చి చూడగా తీవ్ర గాయాలతో మృతిచెంది ఉన్నాడు. ఆగ్రహానికి గురైన స్థానికులు కుక్కను కొట్టి చంపారు. తమ పసిబాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటనను చూసిన స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.



మృతి చెందిన పసిబాలుడు